క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో కర్ణాటక మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కర్ణాటక రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, చిన్న స్థాయి పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.నాగరాజు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి నాగరాజును ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

గర్భిణుల ఆరోగ్యానికి అభయం వైఎస్సార్ కిట్లు



భవానీపురం(విజయవాడ పశ్చిమ): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వారి ఆరోగ్యానికి అభయం వంటిదని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతల రక్తహీనతను నిరోధించే పోషక పదార్థాలైన అటుకులు, జొన్న, రాగి పిండి, పప్పుచక్క, బెల్లం, ఎండు కర్జూరాలతో కూడిన వైఎస్సార్ కిట్లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.లక్ష్మి, శోభ, తులసి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షాపీఠంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ దుర్గా ప్రసాద్ స్వామిజీ అభయ వీరాంజనేయ స్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం పంచహారతులను ఇచ్చారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రక్తదానం ప్రాణ దానంతో సమానమని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య నిపుణురాలు డాక్టర్ జాస్మిన్ సుల్తానా పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో 'రక్తహీనత-స్వచ్ఛంద రక్తదానం' అంశంపై సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాస్మిన్ సుల్తానా మాట్లాడుతూ రక్తహీనత వలన రక్తంలో ఆక్సిజన్ వాహక సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. బలహీనత అనేది రక్తహీనత అత్యంత సాధారణ లక్షణమన్నారు. దీనివలన శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడటం, మైకం రావడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. మరో వైద్య నిపుణులు డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా సకాలంలో రక్తం అందక పలువురు మృత్యువాత పడుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉండి సరైన బరువు కలిగిన వ్యక్తులు రక్తదానం చేయడం వలన ఎంతో మందికి ప్రాణదానం చేసినవారవుతారన్నారు. రక్తదానంపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ క్రీడాకారిణికి నగదు పురస్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని పీ హస్తవ్య కోకో, కబడ్డీ క్రీడలలో సత్తా చాటుతున్నారని తక్కిన విద్యార్థులు హస్తవ్యను స్ఫూర్తిగా తీసుకుని క్రీడలో రాణించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో హస్తవ్యకు కె.ప్రసాద్, శ్రీలక్ష్మి సహకారంతో నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రసాద్, శ్రీలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హస్తవ్యను సత్కరించారు. వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ మండవ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, మాచవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాల కోసం సలహాలు ఇవ్వొచ్చు

దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు, పాలక మండలి సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ఎవరైనా సూచనలు, సలహాలు ఇవ్వొచ్చునని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిత్యం జరిగే అన్న ప్రసాద వితరణను మంగళవారం చైర్మన్, పాలక మండలి సభ్యులు పరిశీలించారు. తొలుత మహా మండపం మూడో అంతస్తులోని అన్న ప్రసాదం కోసం వేచి ఉన్న భక్తులతో మాట్లాడారు. క్యూలో వేచి ఉన్న వారికి ఎంత సమయానికి అన్నప్రసాదం అందుతుందని అడిగి తెలుసుకున్నారు. అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడి, భోజనం నాణ్యత గురించి ఆరా తీయడంతో పాటు వారికి అన్న ప్రసాదాన్ని వడ్డించడమే కాకుండా భక్తులతో కలిసి కూర్చుని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గడిచిన వారం రోజులుగా స్నానఘాట్లు, క్యూలు, అన్నదానం విభాగాలను పరిశీలించామన్నారు. కొన్ని లోటుపాట్లను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నదాన సిబ్బందికి సూచన చేశారు. మహా మండపం 3, 2వ అంతస్తులలో శానిటేషన్‌ను మరింత మెరుగ్గా నిర్వహించాలని శానిటేషన్ అధికారులకు సూచన చేశారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవికృష్ణ, ఏతఊట చంద్రశేఖర్, అన్నదానం పర్యవేక్షకులు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పర్యాటకులకు టూరిస్ట్ పోలీస్ సేవలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని తిలకిస్తున్న డీసీపీలు మేరీ ప్రశాంతి, ఉదయరాణి, సీఐ ఉమర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన భవానీపురంలోని బెరంపార్క్/భవానీ ద్వీపాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకుల భద్రత కోసం పోలీస్ యంత్రాంగం టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేసింది. దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించగా డీసీపీ మేరీ ప్రశాంతి లాంచనంగా బోర్డ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యాటకులకు భద్రత కల్పించడంతోపాటు వారికి ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రశాంతంగా తమ పర్యటనను పూర్తి చేసుకునేందుకు ఇక్కడ ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్ దోహదపడుతుందని తెలిపారు. ఇక్కడ మూడు షిఫ్టులలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి భవానీ ద్వీపాన్ని సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు వివిధ రకాల సేవలు అందించనున్నారని తెలిపారు. సేవల్లో భాగంగా విజయవాడ నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాలు, హాస్పిటల్స్, హోటల్స్ సమాచారం ఇస్తారని చెప్పారు. ఆ విధంగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. ముఖ్యంగా పండుగలు, సెలవు దినాల్లో వేలాది మంది పర్యాటకులు కుటుంబసమేతంగా ఇక్కడికి వస్తుంటారని, అటువంటి వారికి ఎటువంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందిస్తామన్నారు. భవానీపురం పోలీస్ స్టేషన్ సీఐ ఎండీ ఉమర్ మాట్లాడుతూ ఈ టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్ నుంచి పర్యాటకులు ఎటువంటి సహాయాన్ని అయినా పొందవచ్చున్నారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండే టూరిస్ట్ పోలీసు అవుట్ పోస్ట్ ద్వారా 63039 18379లో సంప్రదించి అత్యవసర సేవలు పొందవచ్చున్నారు. బోట్ల వద్ద పర్యాటక శాఖ ఉద్యోగుల సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి, సీఐ ఎండీ ఉమర్, ఎస్సైలు రామారావు, అనూష , ప్రసాద్, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

దర్శి వాసుకి సత్కారం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శ్రీశైలం వాసవి సత్ర సముదాయం అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దర్శి వాసును సత్యనారాయణపురంలోని శ్రీకాశివిశ్వేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొల్లూరు రామకృష్ణ అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి వాసుకి పుష్పగుచ్చాలు, శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో భక్తులకు మెరుగైన సేవలు అందించేలా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. వాసును అభినందించిన వారిలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, దమ్మాల మల్లికార్జున, పందిటి అశోక్ ఉన్నారు.

క్యాన్సర్ గుర్తిస్తే నివారించవచ్చు



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ రత్నకుమారి

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా ఆ వ్యాధిని నివారించవచ్చని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఆయుష్మాన్ భారత్ సైకిల్ ఫర్ హెల్త్ పేరుతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. లేబర్‌కాలనీలోని ఉప్పలపాటి రామచంద్రరాజు మున్సిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి కార్పొరేటర్ రత్నకుమారి జెండా ఊపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించి నిర్ధారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, హైస్కూల్ హెచ్ఎం రవికుమార్, పీఈటి సురేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ ఖాజాకు పితృ వియోగం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్, లిమ్రా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ ఖాజాకు పితృ వియోగం కలిగింది. భవానీపురం సభాపతి రోడ్డులో నివసించే ఖాజా తండ్రి జనాబ్ షేక్ ఇస్మాయిల్(75) (భాషా భాయ్) మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య గౌసియ, ముగ్గురు మగ పిల్లలు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మరణవార్త తెలియడంతో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, బాపతి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు జీఎంసీ బాషా, అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ రఫీ, వక్కలగడ్డ శ్రీకాంత్, మైలవరపు దుర్గారావు, మైలవరపు కృష్ణ, హిస్టరీ అకాడమి డైరెక్టర్ వాజిద్ ఖాన్, టీడీపీ నాయకులు ఇస్మాయిల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

భవానీ ద్వీపంలో ఏబీసీ వార్షికోత్సవం



కలెక్టర్ వేణుగోపాలరెడ్డిని సత్కరిస్తున్న తరుణ్ కాకాని

భవానీపురం(విజయవాడపశ్చిమ): అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ) 6వ వార్షికోత్సవం మంగళవారం భవానీ ద్వీపంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి హాజరుకాగా పర్యాటక శాఖ అధికారులతో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏబీసీలో పర్యాటకులపట్ల తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్లు అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, అందులో భాగంగా ఏబీసీ సీఈఓ తరుణ్ కాకాని వంటి యువ పారిశ్రామికవేత్తలు మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రోయింగ్ క్రీడల్లో విజేతలను తయారు చేసేందుకు అమరావతి బోటింగ్ క్లబ్ ఏపీ స్పోర్ట్స్ అథారిటీతో కలిసి వాటర్ స్పోర్ట్స్ శిక్షణ కేంద్రాన్ని కూడా నడపడం సంతోషంగా ఉందన్నారు. ఏబీసీ సీఈఓ డాక్టర్ తరుణ్ కాకాని మాట్లాడుతూ ఏపీ టూరిజం, మినిస్ట్రీ ఆఫ్ టూరిజం, భారత ప్రభుత్వ యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైఏఐ) సర్టిఫికెట్స్ పొందడంతోపాటు 2021-22లో ఉత్తమ వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్ అవార్డ్‌ను కూడా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ సంస్థ ఒడిశా రాష్ట్రంలో కూడా కార్యకలాపాలను నిర్వహిస్తుందని చెప్పారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాలరెడ్డిని తరుణ్ కాకాని సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

శిక్షణ పొందిన వారు పరిశ్రమలు ప్రారంభించాలి

పాయకాపురం(విజయవాడరూరల్): శిక్షణ పొందిన అభ్యర్థులు సొంతంగా పరిశ్రమలు ప్రారంభించాలని ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఏపీ చాప్టర్ ప్రెసిడెంట్ జి.రాధిక పేర్కొన్నారు. మంగళవారం కండ్రికలో అధునాతన ఫ్యాషన్ టెక్నాలజీ పై మహిళలకు ఉచితంగా ఇస్తున్న 30 రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ చంద్రమౌళి, శిక్షకురాలు సింగంపల్లి కేస హర్షిణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మాఘమాసం స్వామికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామికి సింధూరం, ఆకుపూజను నిర్వహించారు. వాహన చోదకులు పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

123 గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



చోరీలకు పాల్పడ్డ నిందితుడ్ని అరెస్టు చేసిన జీఆర్‌పీ పోలీసులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లు, రైల్వేస్టేషన్లలో పలు నేరాలకు పాల్పడ్డ నిందితుడ్ని విజయవాడ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కథనం మేరకు నగరంలోని వించిపేట, ఫోర్‌మెన్‌బంగ్లా ప్రాంతానికి చెందిన బంకి జయప్రకాష్ అలియాస్ జేపీ విజయవాడ రైల్వే స్టేషన్‌తో పాటు రైళ్లలోని ప్రయాణికుల లగేజీలు, సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులను చోరీ చేసి పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం విజయవాడ రైల్వే స్టేషన్‌లో చోరీ చేసేందుకు యత్నిస్తుండగా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారించగా గతంలో అనేక చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆరు కేసుల్లో చోరీ చేసిన 123 గ్రాముల బంగారం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

పెనమలూరు: యనమలకుదురులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఉమాశంకర్‌నగర్‌కు చెందిన పీతా రాంబాబు(62) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతను తన ఆఫీసు యనమలకుదురు వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసుకుని వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తాడు. మంగళవారం పొద్దుపోయిన తరువాత తాడిగడప డొంక రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రత్తయ్య రైస్ మిల్లు వద్ద తాడిగడప నుంచి అతి వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురం విద్యుత్ సబ్ స్టేషన్ జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధు గార్డెన్ ఏరియా, ఏఎస్.రామారావు రోడ్డు, శాంతినగర్, జమ్మిచెట్టు సెంటర్, పీవీపీ రోడ్డు, ఉడ్‌పేట, బాడవపేట, వాటర్ ట్యాంక్ రోడ్డు, శిఖామణి సెంటర్, నెహ్రూ నగర్, రామశాస్త్రి వీధి, కస్తూరిబాయి పేట, గిరిపురం, రెడ్ సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ సమీపంలోని స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ ఎస్‌వీఎస్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. కుర్రా సూర్యనారాయణవీధి, నారా చంద్రబాబునాయుడుకాలనీ, ఖన్నానగర్, మోడ్రన్ హెచ్‌టీ సర్వీస్, ఈనాడు హెచ్‌టీ సర్వీస్, ఎస్‌బీఐ కాంప్లెక్స్, రాఘువనగర్, చెన్నపాటి రామకోటయ్య వీధితో పాటు ఎయిర్‌టెల్ హెచ్‌టీ సర్వీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

17 నుంచి శివరాత్రి మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు.17వ తేదీ ఉదయం గణపతి పూజ, స్వామి వార్లకు మంగళ స్నానాలు, పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరిస్తారు. 18వ తేదీ తెల్లవారుజామున ఐదు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయి. శని త్రయోదశిని పురస్కరించుకుని స్వామికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం ఏడు గంటలకు ఎదుర్కోల ఉత్సవం, రాత్రి 9 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, భస్మాభిషేకం జరుగుతుంది.

మొబైల్‌కోర్టులో పలువురికి జరిమానా



మొబైల్ కోర్టులో కౌన్సిలింగ్ ఇస్తున్న జడ్జి రామ్మోహన్

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు అసౌకర్యం కలిగించేలా వ్యవహరించేవారిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ మొబైల్ కోర్టు జడ్జి యు.రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రతి వారం జరిగే మొబైల్ కోర్టు మంగళవారం సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై నమోదైన 41 కేసుల్లో నిందితులను అధికారులు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా వారందరికీ రూ.11,720 జరిమానా విధించారు. జరిమానా విధించిన వారిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నవారు, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలేసిన వారిని, రోడ్లపై చెత్త వేసే వాళ్లు ఉన్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ యు.సృజన, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ నవ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

ఆగస్టు 22న కేబీఎన్‌లో ద్విసహస్ర పద్యగళార్చన



పద్యాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆదికవి నన్నయ్య మహాభారతం రాసి వెయ్యి సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఆగస్టు 22వ తేదీన ద్వి సహస్ర పద్యగళార్చనను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 108 పద్యాలను ఎంపిక చేసి విద్యార్థులతో ఒకే సారి పద్య పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన పద్యాల సంకలన పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మంగళవారం ఆవిష్కరించారని తెలిపారు. అలాగే కళాశాలలో జరిగిన ద్విసహస్ర పద్యగళార్చనకు వెంకయ్యనాయుడును ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ నన్నయ రాసిన మహాభారతం కేవలం ఇతిహాస గ్రంథం మాత్రమే కాదని, తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు, నైతిక, ఆధ్యాత్మిక విలువల సమాహారంగా ఉంటుందని వివరించారన్నారు. వెంకయ్యనాయుడు కలిసిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ ఉన్నారు.

అమరవీరులకు ఘన నివాళులు

పాయకాపురం(విజయవాడరూరల్): ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మంది సీఆర్పీఎఫ్ జవాన్లకు ఘనంగా నివాళులర్పించే కార్యక్రమం మంగళవారం 61వ డివిజన్లో జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బల్లం కిషోర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను భారతదేశం ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసం దుర్గారావు, రాచకొండ సాంబయ్య, అన్నపరెడ్డి రామిరెడ్డి, కృష్ణారెడ్డి, కుంచర్లపాటి ఫణీంద్ర పాల్గొన్నారు.

• పుస్తక ప్రియుల సందడి





పుస్తక మహోత్సవ ప్రాంగణంలో పుస్తక ప్రియులు సందడి చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న 33వ విజయవాడ పుస్తక మహోత్సవంలో మంగళవారం పుస్తకావిష్కరణలు, సదస్సులు జరిగాయి. ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, సాహితీవేత్తలు, అభిమానులు పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

